క్లుప్తంగా

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లెలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలకు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్స్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి, షెక్షావల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా అబ్దుల్ సలాం



బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఇన్‌కమ్ టాక్స్ అండ్ జీఎస్టీ ప్రాక్టిషనర్, అడ్వకేట్ అబ్దుల్ సలాం ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టిషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా నంద్యాల జిల్లా తరఫున ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలో కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ సలాం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న వేదపండితులు

డోన్ టౌన్ : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పద్మావతి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి దీపోత్సవ కైంకర్యం చేశారు. ఈ సందర్భంగా గోష్ఠి సభ్యులు అమ్మవారికి హారతులు ఇచ్చారు.

సంతాపం


మౌలాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్ : స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఆదివారం దివంగత మౌలాలి (సంఘం గౌరవాధ్యక్షులు) సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సంఘం నాయకులు, సభ్యులు, పెన్షనర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మౌలాలి సేవలను శతావధాని, కళారత్న గండ్లూరి దత్తాత్రేయశర్మ, రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం సలహాదారుడు హనీఫ్, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న రామాంజనేయులు

డోన్ రూరల్ : మండల పరిధిలోని యాపదిన్నె గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు వారి ఆదీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. భూ పోరాటం కార్యక్రమంలో భాగంగా ఆదివారం యాపదిన్న గ్రామంలో పేదల స్వాదీనంలో ఉన్న భూమిలో పార్టీ జెండా పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హుసేన్, ఖలీల్‌బాషా, పాపారాయుడు, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని జీఎన్ఎస్ క్యాంప్ సమీపంలో శనివారం బొలెరో క్యాంపర్ కోనాపురానికి చెందిన పెద్దమద్దిలేటిని (68) ఢీకొట్టింది. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు.

సులువైన మూగజీవాల వైద్యం!

- ఉపయోగకరంగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల
- బనగానపల్లె నియోజకవర్గంలో మూడువేల పశువులకు రక్తపరీక్షలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పశువులు, జీవాల పోషకులు


బనగానపల్లెలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల


రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)


పరీక్షల నిమిత్తం పశువు నుంచి రక్తాన్ని సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె : రైతు పక్షపాతిగా పేరుగాంచిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యనిచ్చారు. ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పి రైతులకు నేరుగా సేవలందించారు. అదేవిధంగా మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. పశువులు అనారోగ్యానికి గురైతే పశుయజమానులు పడే ఆందోళనను గుర్తించి ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మరో వైపు సంచార పశువైద్యశాల అంబులెన్స్ ద్వారా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు అందించిన విషయం తెలిసిందే. పశువైద్యసేవలు అవసరం ఉన్నవారు టోల్‌ఫ్రీనంబరు 1962కు చేస్తే వెంటనే సంచార పశువైద్య అంబులెన్స్ ద్వారా పశువైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించారు. వ్యాధి తీవ్రత మేరకు అంబులెన్స్‌లో పశువులను సమీపంలోని పశువైద్య ఆసుపత్రులకు తీసుకువచ్చి వైద్య సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధి పరీక్షల వివరాలు

సంవత్సరం	పరీక్షల సంఖ్య
2021-22	460
2022-23	1,660
2023-24	480
2024-25	200

జబ్బు తెలుసుకుని వైద్యం

గతంలో పశువు ఆరోగ్య పరిస్థితి మేరకు వైద్య సౌకర్యం కల్పించేవారు పశువైద్యులు. అయితే ఒక్కోసారి జబ్బు ఏది అనేది ఖచ్చితంగా తెలియకపోవడంతో చికిత్స ఫలించేదికాదు. దీంతో పశుమరణాలు జరిగేవి. రైతులు ఆర్థికంగా నష్టపోయ్యేవారు. సమస్యను గుర్తించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశుమరణాలు అరికట్టేందుకు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా 2021 జూలై 9న డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయించారు. అక్కడే పశువులకు అన్నిరకాల పరీక్షలు చేస్తున్నారు. పశువుల పేడా రక్తనమూనాలు, నశీకద్రావాలు, చర్మం, మూత్రం, పాలు తదితర వాటి నమూనాలు సేకరించి పరీక్షల నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. బనగానపల్లె ప్రయోగశాలలో ఇప్పటి వరకు 3,000 పశువులకు సంబంధించిన నమూనాలకు పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించారు. దీంతో పశువులకు వైద్యం సులువైంది.

ఎంతో ఉపయోగకరం



డాక్టర్ వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఎంతో ఉపయోగకరంగా ఉంది. మూగజీవాలకు సోకిన వ్యాధులను గుర్తించడం సులువైంది. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతున్నాం. పశుపోషకులు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–మారుతిసకారామ్, పశుసంవర్థకశాఖ ఏడీ బనగానపల్లె

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

బనగానపల్లె రూరల్ : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయినట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. 266 మంది వివిధ శాఖల ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొండపేట కాలనీలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

కొలిమిగుండ్ల: సామాజిక పింఛన్ల పంపిణీకి మండలంలో 130 మంది సిబ్బందిని నియమించినట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ప్యాపిలి: సామాజిక పింఛన్ లబ్ధిదారులకు సోమవారం నగదు అందజేసేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బూరుగల, కొలుపల్లి గ్రామాల్లో చేపట్టే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

2న ఆరాధనోత్సవాలు

బనగానపల్లె : పట్టణ సమీపంలోని పూదోట లింగమూర్తి మఠంలో జూలై 2న ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పల్లె నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పంచామృతాభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు దీపాసమాయుక్త నివేదనలు, రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి


దస్తగిరి దంపతులను సత్కరిస్తున్న ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి


రాయప్ప దంపతులకు ఊరేగింపుగా వీడ్కోలు పలుకుతున్న దృశ్యం


అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఆదివారం పదవీ విరమణ చేశారు. సబ్‌రిజిస్ట్రార్ సర్వేశ్వరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఎస్‌బీఐ బజార్‌బ్రాంచ్ హెడ్ మెసెంజర్ దస్తగిరి, ఆర్అండ్‌బీశాఖలో పనిచేస్తున్న రాయప్ప పదవీ విరమణ చేయడంతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ సుధీర్‌కుమార్‌రెడ్డి, కాంట్రాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ

సంజామల: మండల కేంద్రం సంజామల ప్రజాపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నాగకుమార్, ఈఓఆర్డీ పాపరాయుడు, ఏఓ నరేంద్రనాథ్ శర్మ ఆదివారం పదవీ విరమణ పొందారు. వీరికి తోటి ఉద్యోగులు, స్నేహితులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి విజయకుమార్ రెడ్డి, ఎంఈఓలు రాజయ్య, ఈశ్వరయ్య, ఏపీఓ ప్రకాష్ రావ్, ఏఈ బాల చంద్రుడులు, పంచాయితీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులతో గుర్తింపు

బేతంచెర్ల: ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఎస్ఐగా పదోన్నతిపొంది ఆదివారం పదవీ విరమణ చేసిన కలీముల్లా బేగ్‌ను సన్మానించారు. ఆయనకు సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు, సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లింగమయ్య, పోలీస్ సిబ్బంది తిరుపాల్ నాయక్, శ్రీనివాసులు, తిరుమలయ్య, గురుబాబు, మద్దిలేటి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కోవెలకుంట్ల: మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి వాటిని పెంచి పెద్ద చేసి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్సీ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణా రహితంగా అడవులను నరికి వేస్తుండటంతో వాతావరణ కాలుష్యం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జిగాళ్ల లింగన్న, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చాందిని, జిల్లా అధికార ప్రతినిధి వెంకటసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు లక్ష్మయ్య, వెంకన్న, భీమయ్య, నాగరాజు, వంశీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'ఆ నలుగురు'


నేహ కుమారి మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఓ మహిళ మృత దేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మరోమారు ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు మానవత్వం చాటుకున్నారు. రాజస్థాన్ నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన నేహకుమారి (22) మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని తిరిగి రాజస్థాన్‌కు తీసుకపోలేని పరిస్థితుల్లో అంత్యక్రియలు ఇక్కడే నిర్వహించాలని పోలీసులను, ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వన్నూర్ బాషాను మృతురాలి బంధువులు కోరారు. దీంతో వారు బ్రాహ్మణ ఆచారం ప్రకారం బేతంచెర్ల స్మశాన వాటికలో దహన సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సభ్యులు లక్ష్మీ రాఘవ, యూసుఫ్, అక్బర్, వెంకటేశ్వర్లు, మా బాషా పాల్గొన్నారు.

● ఎందుకీ నిర్లక్ష్యం?


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డిల ఫొటోలపై పేపర్లు తీయని దృశ్యం

బనగానపల్లె రూరల్ : ఎన్నికల కోడ్ ఎన్నికల కోడ్ ఈ నెల 6న ముగిసినా బనగానపల్లె ఏరియా ఆసుపత్రి ప్రధాన ద్వారంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫొటోలపై కప్పిన తెర తొలగించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లెలో ఉన్న 50 పడకల వైద్యశాలను వంద పడకల ఏరియా వైద్యశాలగా మార్పు చేయించారు. రూ.22 కోట్లు మంజూరు చేయించి త్వరిత గతిన వైద్యశాల నిర్మాణంతోపాటు వైద్యులు, సిబ్బంది నియామకం చేయించారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఆసుపత్రి ప్రధాన ద్వారంపై ఉన్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫొటోలపై అధికారులు పేపర్లను అంటించారు. ఎన్నికల కోడ్ ముగిసినా వారి ఫొటోలపై అంటించిన పేపర్లను తొలగించకపోవడంతో ఎందుకీ నిర్లక్ష్యం అంటూ ప్రశ్నిస్తున్నారు ప్రజలు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఫొటోలపై అంటించిన కాగితాలను తొలగించాలని కోరుతున్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

21న భక్తి గీతాల పోటీలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో జూలై 21న గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా 15 ఏళ్ల లోపు బాలబాలికలకు భక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ వీడీ రాజగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలబాలికలు నచ్చిన భక్తి గీతాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి 15వ తేదీలోపు 8008527678 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు. పది మందిని ఎంపిక చేసి గురుపౌర్ణమి రోజున గీతాలుపాడే అవకాశం కల్పిస్తామని, ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు.

క్రిష్ణగిరిలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

- ఖండించిన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్

డోన్ టౌన్ : మండల కేంద్రం క్రిష్ణగిరిలో శనివారం రాత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దుశ్చర్యకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో దివంగత వైఎస్సార్ పేదల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దాడులు అధికమయ్యాయని, ఇలాంటి కక్షసాధింపు చర్యలు ఏ మాత్రం సమంజసం కాదన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలతో మంత్రి బీసీ సమీక్ష

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలంలోని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సాయంత్రం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి హోదాలో తొలిసారిగా కోవెలకుంట్లకు చేరుకోవడంతో నాయకులు, అభిమానులు బీసీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామాల వారీగా చర్చ జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, పేరా శ్రీధర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, అమడాల మద్దిలేటి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

డోన్ రూరల్ : పట్టణ సమీపంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలకు వెంటనే రక్షణ గోడలు నిర్మించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివన్న డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ లేనందునే ఇద్దరు బాలికలు పారిపోయారని, పోలీసులు గుర్తించకుంటే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. బాలికల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు విజయ్, సాయిభరత్, శేఖర్, మనోజ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

డోన్ టౌన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు పెట్టుబడి సాయాం సకాలంలో అందించడంతో సాగు సులభతరం అయ్యిందన్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం అవుతున్నా టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకపోడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొండన్న, భాస్కర్‌రెడ్డి, శివరామ్, చిన్నరహిమాన్, మధు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణం అపరిశుభ్రం!


బస్టాండ్ ముఖద్వారం పక్కన చెత్తచెదారం

బనగానపల్లె రూరల్ : ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. బస్టాండ్ ముఖద్వారం పక్కన కుళ్లిన ఆహారపదార్థాలు, చెత్తచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులతోపాటు ప్రధాన రహదారి బాటసారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సమీప హోటళ్లలో మిగిలిపోయిన ఆహార ప్రదార్థాలు, వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని అక్కడ పడేస్తుండడంతో ఈ దుస్థితి నెలకొంది. పందులు, ఆవులు, వీధి కుక్కలు అక్కడకిచేరి మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. బస్టాండ్ ఖాళీ ప్రదేశంలో చెత్త,చెదారం వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులతోపాటు స్థానికులు కోరుతున్నారు.



గుమిగూడిన పందులు, ఆవులు

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం జూలై 1నుంచి అమలు చేయాలనుకున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నాయకుడు మద్దిలేటి స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రవాణా రంగాన్ని నాశనం చేసే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని జూలై 11న బేతంచెర్లలో నిర్వహించే ట్రాన్స్‌పోర్ట్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లారీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కార్మికులు హరి, ప్రసాద్, రామచంద్రుడు, రాజు, వెంకట్రాముడు, మల్లికార్జున, కోట్ల మధు, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.